సాక్షి
వికారాబాద్
సోమవారం । 30 । అక్టోబర్ । 2023






**ప్రచారం జోరుగా**

వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్ గెలుపు కోసం ఆయన సతీమణి పీరంపల్లిలో ఇంటింటా ప్రచారం చేశారు. 10లో▸



**జోరుగా ఫిరాయింపులు**

ఎన్నికలు సమీపిస్తున్న వేళ జిల్లాలోని అన్ని పార్టీల్లో ఫిరాయింపుల పర్వం జోరుగా సాగుతున్నాయి. 11లో▸



**బీజేపీతోనే సుపరిపాలన**

బీజేపీతోనే సుపరిపాలన సాధ్యమని, వచ్చే ఎన్నికల్లో పార్టీకి అండగా నిలవాలని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం కోరారు. 11లో▸

## న్యూస్‌రీల్

### పేదల పార్టీ కాంగ్రెస్

డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి



మల్లెమోనిగూడ ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

**దోమ:** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పేదలకు ఎంతో మేలు జరుగుతుందని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని మల్లెమోనిగూడలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో కార్యకర్తలు విసుగు చెంది కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఎక్కడ చూసినా కాంగ్రెస్ మాటే వినిపిస్తోందని తెలిపారు. ఏ గ్రామానికి వెళ్లినా కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధే కనిపిస్తోందని, బీఆర్‌ఎస్ చేసింది ఏమీ లేదని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి హుస్సేన్, పట్టణ అధ్యక్షుడు కృష్ణ, నర్మక్స్ డైరెక్టర్ వెంకట్‌రాం రెడ్డి, మైనార్టీ నాయకులు షోయాబ్, ఆరీఫ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీకి జిల్లా ఉపాధ్యక్షుడి రాజీనామా

అదే బాటలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు

 

రాఘవనాయక్ — మహిపాల్‌రెడ్డి

**వికారాబాద్ అర్బన్:** బీజేపీకి రాజీనామా చేస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, అఖిల భారత గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కే రాఘవనాయక్ ఆదివారం ప్రకటించారు. పార్టీలో చురుగ్గా పనిచేస్తున్నా తగిన గుర్తింపు లేకపోవడం, ఇప్పటి వరకు వికారాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థిని ప్రకటించక పోవడంతో రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. పార్టీలో గిరిజనులకు ఏమాత్రం గౌరవం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ పార్టీలో చేరేది త్వరలో ప్రకటిస్తానని తెలిపారు. అదేవిధంగా కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పార్టీ నిర్ణయాలు క్షేత్రస్థాయిలో తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు బీజేపీని నమ్మే స్థితిలో లేరని ఆరోపించారు. అందుకే పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు.

### లైసెన్స్ గన్‌ల డిపాజిట్

**అనంతగిరి:** ఎన్నికల కోడ్ నేపథ్యంలో పలువురి వద్ద ఉన్న 218 లైసెన్స్ గన్‌లను తిరిగి డిపాజిట్ చేసుకున్నట్లు ఎస్పీ కోటిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు.

### ఎక్కడ ఉన్నా అండగా ఉంటాం

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



పూణే సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

**కుల్కచర్ల:** పరిగి నియోజకవర్గ ప్రజలు ఎక్కడ ఉన్నా వారి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మహారాష్ట్ర పూణేలో పరిగి నియోజకవర్గ స్థాయి లంబాడీల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనుల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని పేర్కొన్నారు. తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఇబ్బందికర పరిస్థితుల్లో వలస వచ్చిన గిరిజనులకు తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఎవరూ అధైర్య పడాల్సిన పని లేదని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం కుల్కచర్ల మండల అధ్యక్షుడు శంకర్ నాయక్, బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడు సార శ్రీనివాస్, బిందెంగడ్డ తండా సర్పంచ్ తుల్యానాయక్, మాజీ ఎంపీటీసీ బాలునాయక్, చెరువుముందలి తండా నాయకుడు బాలు నాయక్ పాల్గొన్నారు.

# మౌనం వీడేనా!

**ఎన్నికల ప్రచారానికి దూరంగా జెడ్పీ చైర్‌పర్సన్ సునితారెడ్డి**

- బీఆర్‌ఎస్ అభ్యర్థులను ప్రకటించి 15 రోజులైనా కానరాని వైనం
- ఎమ్మెల్యేలతో అభిప్రాయ భేదాలే కారణమా?
- తాండూరు, వికారాబాద్ మినహా కొడంగల్, పరిగిలో పర్యటించే అవకాశం



జెడ్పీ చైర్‌పర్సన్ సునితారెడ్డి

**వికారాబాద్:** ఎన్నికల ప్రచారానికి జెడ్పీ చైర్‌పర్సన్ సునితారెడ్డి దూరంగా ఉండటం చర్చనీయాంశంగా మారింది. అధికార పార్టీకి చెందిన ఆమె ఇప్పటి వరకు ఎన్నికల ప్రచారంలో కనిపించలేదు. బీఆర్‌ఎస్ అధిష్టానం జిల్లాలోని నాలుగు అసెంబ్లీ స్థానాలకు ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించి 15 రోజులు దాటింది. బరిలో నిలిచిన వారు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. అయితే జెడ్పీ చైర్‌పర్సన్ సునితారెడ్డి ఇప్పటి వరకే ఏ నియోజకవర్గంలో కూడా అభ్యర్థి తరఫున ప్రచారం చేయలేదు. గతంలో ఎమ్మెల్యేలతో తలెత్తిన వివాదాలే ఇందుకు కారణమని తెలుస్తోంది. ప్రత్యర్థి పార్టీల్లోని చిన్న చిన్న కార్యకర్తలను తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నిస్తున్న ఎమ్మెల్యేలు సునితారెడ్డిని మాత్రం ప్రచారానికి పిలువలేదని ఆమె సన్నిహితులు అంటున్నారు.

**పెరుగుతున్న గ్యాప్**

ఏడాది క్రితం నుంచి ఎమ్మెల్యేలు, వారి వర్గీయులు జెడ్పీ చైర్‌పర్సన్ సునితారెడ్డితో అంటీముట్టనట్లు ఉంటూ వస్తున్న విషయం తెలిసిందే. ఆరు నెలల క్రితం మర్పల్లిలో ఆమె కాన్వాయ్‌పై దాడి జరిగింది. ఈ ఘటనపై కలత చెందిన ఆమె ఎమ్మెల్యేలు, వారి వర్గీయులను దూరం పెడుతూ వచ్చారు. ప్రధానంగా వికారాబాద్, తాండూరు ఎమ్మెల్యేలతో ఏడాది కాలంగా గ్యాప్ పెరుగుతూ వచ్చింది. ఇదిలా ఉండగా అధికార పార్టీకి చెందిన రెండు వర్గాల్లో ఒక వర్గం సునితారెడ్డికి అండగా నిలవగా, మరో వర్గం వ్యతిరేకంగా ఉంది. ఈ వర్గమే ఆమె కాన్వాయ్‌పై దాడికి యత్నించింది. ఈ గొడవలు ఎన్నికల నాటికి సద్దుమనుగుతాయని అనుకుంటే మరింత ముదిరి పాకాన పడుతున్నాయి. అయితే ఆమె వర్గంలోని మెజార్టీ నాయకులు ఇటీవల బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. అసమ్మతి నేతలను బుజ్జగించి, ఒక్క తాటిపైకి తెచ్చే ప్రయత్నం చేస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి.. సునితారెడ్డి ప్రచారానికి దూరంగా ఉన్న విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లినట్లు సమాచారం.

**ఆ రెండు చోట్ల ప్రచారం చేసే అవకాశం**

పరిగి ఎమ్మెల్యేతో జెడ్పీ చైర్‌పర్సన్‌కు పెద్దగా అభిప్రాయ బేధాలు లేకపోవడం, కొడంగల్ ఎమ్మెల్యే స్వయాన ఆమె మరిది కావటంతో ఈ రెండు నియోజకవర్గాల్లో ప్రచారం చేసే అవకాశం ఉన్నట్టు ఆమె సన్నిహితులు పేర్కొంటున్నారు. ఇదే విషయాన్ని ఆమె అధిష్టానం పెద్దలకు కూడా చెప్పినట్లు సమాచారం. అయితే సన్నిహితుల వద్ద మాత్రం అసలు విషయం చెబుతూ.. ఇతరులు ఎవరైనా అడిగితే మాత్రం తన ఆరోగ్యం సహకరించక పోవడం వల్లే ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉంటున్నట్లు చెబుతూ వస్తోంది.

# బీఆర్‌ఎస్‌కు బిగ్ షాక్

- పార్టీకి రాజీనామా చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల దంపతులు
- వారి బాటలో కౌన్సిలర్, కొందరు సీనియర్ నేతలు
- పట్టణంలో పార్టీకి గట్టి దెబ్బ



చైర్‌పర్సన్ దంపతులు మంజుల రమేష్



కౌన్సిలర్ చందర్ నాయక్

**వికారాబాద్ అర్బన్:** కొంత కాలంగా వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్‌పై తీవ్ర అసంతృప్తితో ఉన్న మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులు మంజుల రమేష్ ఆదివారం బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేశారు. వారి రాజీనామాతో పట్టణంలో పార్టీకి గట్టి దెబ్బే అని చెప్పవచ్చు. మున్సిపల్ పరిధిలోని అన్ని వర్గాల్లో రమేష్ కుమార్‌కు మంచి పట్టు ఉంది. మాస్ నాయకుడిగా గుర్తింపు పొందారు. అనేక సార్లు స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించారు. నాలుగు సార్లు ఇండిపెండింట్‌గా పోటీ చేసి కౌన్సిలర్‌గా విజయం సాధించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత 2015లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ తరఫున మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా పోటీ చేసిన రమేష్‌కుమార్ అందరి ఊహలను తలకిందులు చేస్తూ ఏడుగురు కౌన్సిలర్లను గెలిపించుకున్నారు. దీంతో ఆయనకు పట్టణంలో మరింత పట్టు పెరిగింది. 2019లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి డాక్టర్ ఏ చంద్రశేఖర్‌కు మద్దతు ఇచ్చారు. చంద్రశేఖర్ సాధించిన 20వేల ఓట్లలో సుమారు మూడు వేల ఓట్లు పట్టణంలో పోలయ్యాయి. ఇందులో రమేష్ కుమార్ ప్రధాన భూమిక పోషించారనే ప్రచారం ఉంది.

**2020లో బీఆర్‌ఎస్‌లోకి..**

2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికల సమయంలో రమేష్ కుమార్ చైర్మన్ పదవి ఆశించి బీఆర్‌ఎస్‌కు దగ్గరయ్యారు. అయితే చైర్మన్ పదవి జనరల్ మహిళకు రిజర్వు రావడంతో అనూహ్యంగా తన సతీమణి మంజులను బీఆర్‌ఎస్ తరఫున 24వ వార్డు కౌన్సిరల్‌గా పోటీ చేయించారు. ఆమె ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో చైర్‌పర్సన్ పదవి దక్కింది. ఆ తరువాత చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు చైర్‌పర్సన్ దంపతులకు, ఎమ్మెల్యే ఆనంద్‌కు తీవ్రంగా గ్యాప్ పెంచింది. అప్పటి నుంచి ఎమ్మెల్యే ఆనంద్ అధికార పార్టీ కౌన్సిలర్లతో అనేక సార్లు కౌన్సిల్ సమావేశాల్లో చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా నిరసనలు, ఆందోళనలు చేయించారని చైర్‌పర్సన్ దంపతులే నేరుగా ఆరోపించారు. అధికార పార్టీ కౌన్సిలర్లు ఎవరూ కౌన్సిల్ సమావేశానికి హాజరు కాకుండా చేశారని మీడియా ముందు వాపోయారు. అంతటితో ఆగకుండా సొంత పార్టీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టించిన ఘనత ఎమ్మెల్యేకు దక్కుతుందని కూడా ఆరోపించారు. కౌన్సిల్ సమావేశంలో తోటి మహిళా కౌన్సిలర్ చేతిలో నుంచి మైక్ తీసుకున్నందుకు తనపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టించారని, పార్టీ పెద్దలు జోక్యం చేసుకోవడంతో కేసు వాపసు తీసుకున్నారని చైర్‌పర్సన్ అప్పట్లో ఆరోపించారు. అనేక అభివృద్ధి పనులకు ఆమోదం తెలపకుండా ఎమ్మెల్యే అడ్డుకున్నారని బహిరంగంగానే విమర్శించారు. ఎంత అవమానించినా భరిస్తూ పార్టీలో కొనసాగినట్లు తెలిపారు. తమకు సముచిత స్థానం లేని చోట ఉండటం ఇష్టం లేకనే పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ఆమె తెలిపారు. మంజుల రమేష్ కుమార్ దంపతుల బాటలోనే బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన 6వ వార్డు కౌన్సిలర్ చందర్ నాయక్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు జే అరుణ్ కుమార్, విశ్రాంత ఇంజనీర్, జే ప్రదీప్ కుమార్, బీఆర్‌ఎస్ పట్టణ యువ నాయకుడు సాయికృష్ణ పార్టీకి రాజీనామా చేశారు. ఏది ఏమైనా ఎన్నికలు సమీపిస్తున్న వేళ మంజుల రమేష్‌కుమార్ దంపతులు బీఆర్‌ఎస్‌ను వీడడం గట్టి దెబ్బే అని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

# విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించం

**నిఘా బృందాలకు రంగారెడ్డి కలెక్టర్ భారతి హోళికేరి దిశానిర్దేశం**

**సాక్షి, రంగారెడ్డిజిల్లా:** ఎన్నికల విధులను పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వర్తించాలని కలెక్టర్ భారతి హోళికేరి అన్నారు. స్టాటిస్టిక్ సర్వైలెన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ తదితర నిఘా బృందాల అధికారులకు ఆదివారం ఖైరతాబాద్‌లోని జెడ్పీ సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ప్రచార సరళి పరిశీలన, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే చర్యలను నిరోధించడం, ఫిర్యాదులపై తక్షణమే స్పందించడం, నిరంతర తనిఖీల నిర్వహణ తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల వ్యయం విషయంలో ఎలక్షన్ కమిషన్ ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తోందని.. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని నిఘా బృందాలు సమర్థవంతంగా, నిబద్ధతతో నిర్వహించాలన్నారు. ఎన్నికల నిబంధనలను విధిగా పాటించాలని, అన్ని పార్టీలు, అభ్యర్థులతో నిబంధనలకు అనుగుణంగా సమదృష్టితో వ్యవహరించాలన్నారు.

# 'గ్యారంటీ'లపైనే మొదటి సంతకం

- కాంగ్రెస్ పార్టీ వికారాబాద్ అసెంబ్లీ అభ్యర్థి ప్రసాద్‌కుమార్
- మర్పల్లి మండలంలో ఎన్నికల ప్రచారం



మాట్లాడుతున్న గడ్డం ప్రసాద్‌కుమార్

**మర్పల్లి:** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలపై సీఎం మొదటి సంతకం చేస్తారని ఆ పార్టీ వికారాబాద్ అసెంబ్లీ అభ్యర్థి ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని కొంషేట్‌పల్లిలో పార్టీ జెండాను ఎగురవేసి, కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం కొంషేట్‌పల్లి, మొగిల్లిగుండ్ల, దార్గులపల్లి, బిల్‌కల్, మల్లికార్జున గిరి, తుమ్మలపల్లి, నర్సాపూర్ చిన్న, పెద్ద తండాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ వైపే ఉన్నారని, భారీ మెజారిటీతో అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో సీఎం కేసీఆర్ అనేక హామీలు ఇచ్చారని ఏ ఒక్కటీ సక్రమంగా అమలు కాలేదని ఆరోపించారు. ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్ మేనిఫెస్టోను కాపీ కొట్టారని విమర్శించారు. అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొనే ఆరు గ్యారంటీలు రూపొందించినట్లు వివరించారు. ఎమ్మెల్యే ఆనంద్ ప్రజలకు చేసింది ఏమీ లేదని ఆరోపించారు. సొంత పార్టీ నాయకులే ఆయన్ను వ్యతిరేకిస్తున్నారని అన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్ విజయాన్ని ఎవరూ ఆపలేరని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే యాదవరెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ బ్లాక్ -2 అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామేశ్వర్, సహకార సంఘం చైర్మన్ ప్రవీణ్‌రెడ్డి, పార్టీ మండల మండల అధ్యక్షుడు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# మాది భరోసా ప్రభుత్వం

- మరోసారి ఆశీర్వదించండి
- మీ రుణం తీర్చుకుంటా
- ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

**తాండూరు టౌన్:** బీఆర్‌ఎస్ ప్రభుత్వం అంటేనే భరోసా అని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని తాతగుడి, యాదిరెడ్డి చౌక్, సాయిపూర్, ఇందిరమ్మ కాలనీ, భద్రప్ప గుడి, అయ్యప్పనగర్ కాలనీల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని అన్నారు. కేవలం అధికారం కోసం వస్తున్న కాంగ్రెస్ నాయకులకు బుద్ధి చెప్పాలన్నారు. ఆరు గ్యారంటీలు బూటకమని ఆరోపించారు. కర్ణాటకలో కాంగ్రెస్ హామీలు అమలు కావడం లేదన్నారు. తాండూరును రూ. 1,673 కోట్లతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు కరణం పురుషోత్తం రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప, పార్టీ పట్టణ అధ్యక్షుడు నయీమ్, కౌన్సిలర్ శోభారాణి, మహిళా విభాగ్ పట్టణ అధ్యక్షురాలు సంగీత, వర్కింగ్ ప్రెసిడెంట్ పరిమళ, నాయకులు నర్సింహులు, సంతోష్, రాజన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



తాండూరు టౌన్: ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

**మరోసారి ఆశీర్వదించండి**

**తాండూరు రూరల్:** మరోసారి తనను గెలిపిస్తే తాండూరు ప్రజల రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అన్నారు. మండలంలోని చెన్‌గేస్‌పూర్, కోనాపూర్ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశానని, తనను మరోసారి గెలిపిస్తే తాండూరును మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అందరికీ అందుబాటులో ఉంటానని, ఏ సమస్య వచ్చినా వెంటనే వస్తానని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ప్రచార కార్యదర్శి ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అమ్ముడుపోయింది రోహిత్‌రెడ్డే



విలేకరులతో మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

- కాంగ్రెస్ నుంచి గెలిచి బీఆర్‌ఎస్‌లోకి వెళ్లింది నువ్వు కాదా?
- నిలదీసిన బుయ్యని మనోహర్‌రెడ్డి
- రేవంత్‌ను విమర్శించే స్థాయి కాదని హితవు

**తాండూరు:** ప్రజలు ఎంతో నమ్మకంతో కాంగ్రెస్ పార్టీ నుంచి రోహిత్‌రెడ్డిని గెలిపిస్తే, వందల కోట్లు తీసుకొని బీఆర్‌ఎస్ పార్టీలోకి వెళ్లారని డీసీసీబీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ తాండూరు అసెంబ్లీ అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని ఎస్‌వీఆర్ గార్డెన్‌లో పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ జాదవ్ కలిసి విలేకరులతో మాట్లాడారు. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి కానీ, అర్హత కాని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి లేదన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి ఆయన చేసింది ఏమీ లేదన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా గుంతలు పడిన రోడ్లే దర్శనమిస్తున్నాయని ఆరోపించారు. తాండూరులో ఎమ్మెల్యే భూ కబ్జాలకు పాల్పడ్డారని విమర్శించారు. పారిశ్రామిక వాడకు జిన్‌గుర్తి గ్రామ రైతులు పొలాలు ఇస్తే ప్రభుత్వం ఎకరాకు రూ.12 లక్షలు ఇచ్చిందని, అందులో ఎమ్మెల్యే ఒక్కో రైతు నుంచి రూ. లక్ష వరకు తీసుకున్నారని ఆరోపించారు. తాను తాండూరుకు వలస వచ్చానని ఆరోపణలు చేస్తున్నారని, 20 ఏళ్ల క్రితమే తాండూరులో ఓటు హక్కు ఉందన్నారు. తన కొడుకులు తాండూరు పాఠశాలల్లో చదివారని గుర్తుచేశారు. పిల్లల ఉన్నత చదువులు, వ్యాపారం కోసం హైదరాబాద్ వెళ్లానన్నారు. 25 ఏళ్ల క్రితమే తాండూరులో సొంత ఇల్లు ఉందని, రోహిత్‌రెడ్డి ఎమ్మెల్యే అయ్యాకే ఇల్లు కట్టుకున్నారని తెలిపారు. భూ కబ్జాలపై రోహిత్‌రెడ్డి విసిరిన సవాల్‌ను తాము స్వీకరిస్తున్నామని, ఎక్కడికి రావాలో చెబితే భూ కబ్జాలపై ఆధారాలతో వస్తామని ప్రతి సవాల్ విసిరారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, నాయకులు ఉత్తమ్‌చంద్, జనార్దన్‌రెడ్డి, హబీబ్‌లాల, శ్రీనివాస్, రాజ్‌కుమార్, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

# సోషల్.. హవా

- సాంకేతిక విప్లవాన్ని అందిపుచ్చుకుంటున్న పార్టీలు
- ఎన్నికల వేళ విరివిగా సోషల్ మీడియా వినియోగం
- మేనిఫెస్టో ప్రజల్లోకి వెళ్లేలా పోస్టులు
- డిజిటల్ సంస్థలతో ఒప్పందాలు
- విమర్శలు, ప్రతివిమర్శలకు ప్రత్యేక కంటెంట్
- రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్న పార్టీలు




**షాబాద్:** ఒకప్పుడు ఎన్నికలు వస్తే గోడలపై రాతలు.. కరపత్రాలు.. వాల్‌పోస్టర్లు.. సభలు.. సమావేశాలతో ప్రచారం నిర్వహించేవారు. ప్రస్తుతం ట్రెండ్ మారింది. సమాచార సాంకేతిక విప్లవం అన్ని రంగాలతో పాటే రాజకీయాల్లోనూ మార్పు తెచ్చింది. ఎన్నికల ప్రచారానికి సోషల్ మీడియాను నేతలు తెగ వాడేస్తున్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగాం, వాట్సాప్, యూట్యూబ్‌తో పాటు పలు రకాల సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలను వినియోగిస్తున్నారు. సోషల్ మీడియాలో ఆయా పార్టీల మేనిఫెస్టోలతో పాటు, పలు రకాల వీడియోలు, ఫొటోలు, మీమ్స్ షేర్ చేస్తున్నారు. యువత ఓట్లు ఎక్కువగా ఉండటంతో మేనిఫెస్టోతో పాటు రోజువారీ కార్యక్రమాలను పోస్టు చేసి వారికి చేరువయ్యేలా చూస్తున్నారు. ఇందుకు ఆయా పార్టీలు సోషల్ మీడియా కన్వీనర్లను సైతం నియమించుకోవడం విశేషం.

**డిజిటల్ సంస్థలతో ఒప్పందం..**

సోషల్ మీడియాలో ఆయా పార్టీలు ప్రచారం నిర్వహించేందుకు ప్రత్యేకంగా డిజిటల్ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. ఇందుకు పార్టీలు రూ.లక్షల్లో చెల్లిస్తున్నాయి. ఇక డిజిటల్ సంస్థలు సోషల్ మీడియా ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగాం, టెలిగ్రాం, యూట్యూబ్‌లో పార్టీల పేరిట వందల సంఖ్యలో అకౌంట్లు క్రియేట్ చేస్తున్నాయి. వీటి ద్వారా యాడ్స్‌తో పాటు ఆయా సోషల్‌మీడియా ప్లాట్‌ఫాంలలో లైక్‌లు, కామెంట్లు పెట్టేందుకు వందల సంఖ్యలో ఫేక్ అకౌంట్లు తయారు చేస్తున్నారు. వీటి ద్వారా పార్టీల మేనిఫెస్టోలు, వీడియోలు, ఫొటోలను ఎక్కువ మొత్తంలో ప్రజలకు చేరువయ్యేందుకు డిజిటల్ మీడియా సంస్థలు పనిచేస్తున్నాయి. అభ్యర్థులు, ఆశావహులు కూడా డిజిటల్ మీడియా సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. పార్టీల పథకాలతో పాటు రోజువారీ ప్రచారాన్ని సోషల్‌మీడియాలో పోస్టు చేసి జనాలకు చేరువ చేసే ప్రయత్నం చేస్తున్నారు. వాట్సాప్ చానళ్లు, గ్రూపులను క్రియేట్ చేసి అందులో పోస్టులు పెడుతున్నారు. ఒక్క పోస్టు పెడితే లక్షల మంది చూస్తుండటంతో సోషల్ మీడియాను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఇందుకోసం అభ్యర్థులు రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నారు.

**ప్రత్యేక కంటెంట్‌తో..**

ఇక డిజిటల్ మీడియా సంస్థలు తాము ఒప్పందం కుదుర్చుకున్న పార్టీల కోసం, ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల కోసం పార్టీలకు అనుకూలమైన, ప్రజలకు చేరువయ్యే అంశాలతో కూడిన ప్రత్యేక కంటెంట్ తయారు చేస్తున్నాయి. ఈ కంటెంట్‌ను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు చేరువచేస్తున్నాయి. పోస్టులను ఎక్కువ మందికి చేరువచేయడానికి ఆయా సోషల్ మీడియా సంస్థలకు డబ్బులు చెల్లించి, లొకేషన్‌తో పాటు ఆయా వయస్సుల ఓటర్లకు చేరువయ్యేలా చూస్తున్నారు. ప్రత్యేక కంటెంట్ కోసం డిజిటల్ సంస్థలకు పార్టీలు భారీగా డబ్బులు ఇస్తున్నాయి. కంటెంట్ రాసిచ్చే వారిని డిజిటల్ మీడియా సంస్థలే భారీగా రిక్రూట్ చేసుకుంటున్నాయి.

**నిర్ధారించుకోవాలి**

ఇక ఆయా పార్టీలు సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్న కంటెంట్‌ను చూసి ఏది నిజమో..ఏది అబద్ధమో తెలియని పరిస్థితిలో ఓటర్లున్నారు. ఓటర్లు కూడా సోషల్‌మీడియాలో వస్తున్న వార్తలు, పోస్టులను నిర్ధారించుకోవడం అతిముఖ్యం. అలా నిర్ధారించుకున్న తర్వాతే నమ్మాలని అధికారులు సూచిస్తున్నారు. సోషల్ మీడియాలో వస్తున్న పోస్టులపై ఇబ్బంది కలిగితే ఫిర్యాదు చేయొచ్చని సూచిస్తున్నారు.

## క్లుప్తంగా

### రథయాత్రను విజయవంతం చేయండి

బొంరాస్‌పేట: ఎస్సీ రిజర్వేషన్ బిల్లును శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టి న్యాయం చేయాలనే డిమాండ్‌తో చేపట్టిన మాదిగల విశ్వరూప సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుభాష్ మాదిగ అన్నారు. సభను విజయవంతం చేసేందుకు చేపట్టిన రథయాత్ర మోమిన్‌పేటకు రానుందని చెప్పారు. ఈ మేరకు మాదిగరిజర్వేషన్ పోరాట సమితీ (ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో సాగుతున్న రథయాత్రను విజయవంతం చేయాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున మాదిగలు తరలిరావాలని కోరారు. ఇందులో మండల కన్వీనర్ తిరుపతి మాదిగ, రాములు మాదిగ, వెంకట్, నర్సింలు తదితరులున్నారు.

### ప్రజా ఆశీర్వాదం ప్రసాద్‌కుమార్‌కే..

**పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి**

ధారూరు: అధికార బీఆర్‌ఎస్ కాసులతో ఓటర్లతో కొనుగోలు చేయాలని చూస్తున్నారని పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా వికారాబాద్ ఎమ్మెల్యేగా మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్ గెలుపును ఆపలేరన్నారు. లక్షలు పెట్టి నాయకులను కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు భంగపాటు తప్పదన్నారు. బీఆర్‌ఎస్ మోసాలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని ప్రసాద్‌కుమార్‌కే వారి ఆశీర్వాదం ఉంటుందన్నారు.

### కండక్టర్‌పై దాడి.. కేసు నమోదు

దౌల్తాబాద్: గుర్తుతెలియని దుండగులు ఆర్టీసీ కండక్టర్‌పై దాడి చేసి గాయపర్చిన ఘటన మండలంలోని దేవర్‌ఫసల్‌వాద్ గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. దామరగిద్ద మండల మొగులమడక గ్రామానికి చెందిన జగదీష్ నారాయణపేట డిపోలో ఆర్టీసీ కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం సాయంత్రం జగదీష్ ఓ వ్యక్తితో కలిసి బైక్‌పై మద్దూరుకు వెళ్తున్నాడు. నలుగురు దుండగులు కారుతో బైక్‌ను వెంబడించి దేవర్‌ఫసల్‌వాద్ గ్రామ సమీపానికి రాగానే జగదీష్‌పై దాడి చేశారు. చుట్టు పక్కల పొలాల వారు రావడంతో దుండగులు పారిపోయారని స్థానికులు తెలిపారు. తీవ్రంగా గాయపడ్డ జగదీష్‌ను చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్‌కు తరలించారు. ఘటన స్థలాన్ని కొడంగల్ సీఐ రాములు పరిశీలించి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### విద్యార్థి అదృశ్యం



కృష్ణసాయి (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: కళాశాలకు వెళ్లిన డిప్లొమా విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మన్న కృష్ణసాయి మండల పరిధిలోని పిగ్లీపూర్ రెవెన్యూ పరిధి అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లొమా మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కళాశాల హెచ్‌ఓడీ ఈనెల 17న విద్యార్థి తండ్రి అమరేశ్వరరావును కళాశాలకు పిలిపించాడు. హెచ్‌ఓడీ కృష్ణసాయి తండ్రితో మాట్లాడుతుండగా బయటకు వచ్చిన విద్యార్థి తిరిగి కనిపించలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అమరేశ్వరరావు శనివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.



# పతులకు తోడుగా.. ప్రచారం జోరుగా



అనంతగిరి: ప్రచారంలో మాట్లాడుతున్న సబితానంద్



దోమ: ఆరు గ్యారెంటీలను వివరిస్తున్న ఉమారెడ్డి

- నియోజవర్గాన్ని చుట్టేస్తున్న బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అధ్యక్షుల సతీమణులు
- ఇంటింటికీ తిరుగుతూ ఓటు అభ్యర్థిస్తున్న వైనం

అనంతగిరి: వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్ గెలుపు కోసం ఆయన సతీమణి డాక్టర్ సబితానంద్ ఆదివారం మండలంలోని లాల్‌సింగ్ తండా, పీరంపల్లి గ్రామాల్లో గడపగడపకూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి మేనిఫెస్టోను అందించి తన భర్తను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఇంటికి బీఆర్‌ఎస్ సంక్షేమ పథకం ఏదో ఒక రూపంలో చేరిందన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. ప్రజాసేవకై ఎమ్మెల్యే ఎప్పుడూ పరితపిస్తారని, మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కమాల్‌రెడ్డి, ఎంపీపీ చంద్రకళ, ఎంపీపీ గౌసోద్దీన్, సర్పంచ్‌లు జయమ్మ నరేందర్ రెడ్డి, రాములునాయక్, అనిత, మైనార్టీ సెల్ అధ్యక్షుడు గయాజ్, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ పార్టీకి మద్దతివ్వండి**

కుల్కచర్ల: కాంగ్రెస్ పార్టీకి ప్రతీ ఒక్కరూ మద్దతివ్వాలని డీసీసీ అధ్యక్షుడు టీఆర్‌ఆర్ సతీమణి ఉమా రామ్మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం చౌడాపూర్ మండల పరిధిలోని వీరాపూర్ గ్రామంలో ఆమె ఆరు గ్యారెంటీలపై ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఆమె పర్యటనలో పలువురు వీరాపూర్ గ్రామస్తులు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ చౌడాపూర్ మండల అధ్యక్షుడు అశోక్ కుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలు సరిత, నాయకులు సత్యం, అనంతరెడ్డి, మాసయ్య, మాధవరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, భూపతిరెడ్డి, నారాయణ, దశరథం, శ్రీను, ఈశ్వరయ్య, వెంకట్రాములు, చెన్నయ్య, వెంకటయ్య, మధురెడ్డి, ఎజాజ్, ముజీబ్, మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

**రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే**

దోమ : రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, ప్రజలందరూ డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డిని గెలిపించాలని ఆయన సతీమణి ఉమారెడ్డి కోరారు. ఆదివారం దోమ మండల పరిధిలోని దాదాపూర్ గ్రామంలో ఆరు గ్యారంటీలపై స్థానిక నేతలతో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికార బీఆర్‌ఎస్ పార్టీ ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. దళితబంధు, బీసీబంధు, మైనార్టీ బంధులను అధికార పార్టీ నేతలకే ఇచ్చా రని ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలతో పాటు వివిధ సంక్షేమ పథకాలతో ప్రజలకు మేలు జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పట్నం నరేందర్‌రెడ్డి

# ఎల్లలు దాటిన 'కారు'

- మహారాష్ట్రలోని పూణేలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో బంజారా ఆత్మీయ సభ
- పాల్గొన్న పట్నం సోదరులు

బొంరాస్‌పేట: తెలంగాణ ఎన్నికల ప్రచారం రాష్ట్రం దాటింది. ఆదివారం మంత్రి మహేందర్‌రెడ్డి, కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మహారాష్ట్రలోని పూణేలో బంజారా ఆత్మీయ సభ నిర్వహించారు. నియోజకవర్గం నుంచి వలస వెళ్లిన బొంరాస్‌పేట మండలంలోని తండాల్లోని గిరిజనులు పెద్ద ఎత్తున హాజరై తమ మద్దతు ప్రకటించారు. కాంట్రాక్టర్లు, ఉద్యోగులు, భవననిర్మాణ కార్మికులుగా పనిచేసే బంజారాలంతా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు అరుణదేశు చౌహాన్, బాల్‌సింగ్‌నాయక్, చాంద్‌పాషా, దేశ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.



హాజరైన వలస బంజారాలు

# ధైర్యంగా ఓటు హక్కు వినియోగించుకోండి



కవాతు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది, కేంద్ర బలగాలు

**డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి**

కొడంగల్ రూరల్: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును ధైర్యంగా వినియోగించుకోవాలని డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పోలీసు సిబ్బంది, కేంద్ర బలగాలతో పట్టణంలోని ప్రధాన రహదారి మీదుగా కవాతు నిర్వహించారు. శ్రీమహాలక్ష్మి వేంకటేశ్వరస్వామి దేవాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు కొనసాగిన పోలీసు కవాతు పీఎస్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ఓటు వేసేందుకు పోలీసు శాఖ చర్యలు చేపట్టిందన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐ రాములు, ఎస్‌ఐలు భరత్‌రెడ్డి, శంకర్, రమేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్‌తోనే సమన్యాయం



ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్

వికారాబాద్ అర్బన్: అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మున్సిపల్ పరిధిలోని రామయ్యగూడ, అనంతగిరిపల్లి, గెరిగెట్ పల్లి, బూర్గుపల్లిలో పర్యటించారు. కాలనీల్లో ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని పనులను పూర్తి చేసినట్లు తెలిపారు. కారు గుర్తుకు ఓటు వేసి గెలపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా అయా వార్డుల్లో పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం బీజేపీకి చెందిన కొందరు యువకులు ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆనంద్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. శివరాంనగర్ కాలనీ బీజేపీకి చెందిన బాలుయాదవ్, వెంకటేశ్, రవి, మల్లేశం, చింటు తదితరులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

# కమలం.. కారు ఒకటే

- నమ్మి ఓటేస్తే నట్టేట ముంచుతారు
- ప్రజా సేవకు ఒక్క అవకాశం ఇవ్వండి
- కాంగ్రెస్ చేవెళ్ల అభ్యర్థి భీంభరత్



భీంభరత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

నవాబుపేట: కమలం.. కారు పార్టీలు రెండూ ఒకటేనని.. వారికి నమ్మి ఓటేస్తే నట్టేట ముంచుతారని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అభ్యర్థి పామెన భీంభరత్ విమర్శించారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్‌ఎస్ సిద్ధాంతం ప్రజలను మోసం చేయడమేనని ఆరోపించారు. వారి పాలనలో ప్రజలకు జరిగిందేమీ లేదన్నారు. ఈ ఎన్నికల్లో వారికి ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి పేదల నడ్డి విరిచి.. ఇప్పుటకు వంటగ్యాస్ తక్కువ ధరకే ఇస్తామంటూ మరోసారి మోసం చేసేందుకు సిద్ధమయ్యారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీలను అమలు చేసి చూపుతామన్నారు. ప్రజలకు సేవ చేసేందుకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు.

**ప్రతిపక్షాలది తప్పుడు ప్రచారం**

అనంతరం మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి మాట్లాడుతూ.. కర్ణాటకలో ఇచ్చిన హామీలన్నీ అమలవుతున్నాయన్నారు. కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారని ఆరోపించారు. అనంతరం వివిధ గ్రామాలకు చెందిన 200 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం ఇటీవల గంగ్యాడలో కాంగ్రెస్ నాయకుడు ఉపేందర్‌రెడ్డిపై దాడిని ఖండిస్తూ పీఎస్ ఎదుట ధర్నా చేపట్టారు. నిందుతుడిని రిమాండ్ చేయాలని డిమాండ్ చేశారు. కాగా సీఐ ఆంజనేయులు, ఎస్‌ఐ భరత్‌భూషన్‌లు మాట్లాడుతూ.. ఇప్పటికే కేసు నమోదు చేశామని.. రెండు రోజుల్లో రిమాండ్‌కు తరలిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ బి–బ్లాక్ అధ్యక్షుడు మదుసూదన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటయ్య, నాయకులు వెంకట్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సంజీవరెడ్డి, ఎక్బాల్, సంగారెడ్డి, రవీందర్‌రెడ్డి బాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### కసాయి కొడుకు కటకటాల పాలు

**తల్లిని చంపిన కేసులో ఇద్దరికి రిమాండ్**

బషీరాబాద్: కన్నతల్లిని హత్యచేసిన కసాయి కొడుకును పోలీసులు కటకటాల్లోకి నెట్టారు. మండల పరిధిలోని కాశీంపూర్‌లో ఈ నెల 27న వెలుగు చూసిన మహిళ హత్యాకేసు వివరాలను తాండూరు రూరల్ సీఐ రాంబాబు ఆదివారం మీడియాకు వెల్లడించారు. తన తల్లి అంజమ్మ నాకు అప్పులు ఇచ్చిన వారితో తనపై ఒత్తిడి పెంచడంతో హత్య చేసినట్లు కయ్య వెంకటేశ్ పోలీసులకు తెలిపారు. దసరా పండగా రోజు ఇదే విషయమై తన తల్లితో గొడవ జరిగిందని.. కోపంతో కొట్టడంతో కిందపడిపోగా ఆమే చీరతోనే గొంతుకు బిగించి హత్యచేసినట్లు నిందితుడు నేరాన్ని అంగీకరించారని సీఐ తెలిపారు. హత్యానంతరం గ్రామానికి చెందిన లింగంపల్లి నవీన్‌కు రూ.10వేలు ఆశచూపి మృతదేహాన్ని ఆటోలో తీసుకెళ్లి వాగులో పడేశారని సీఐ తెలిపారు. ఈ కేసులో నిందితుడికి సహకరించినందుకు నవీన్‌కుమార్‌ను సైతం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ పోలీసులు పాల్గొన్నారు.

### పోలీసుల తనిఖీల్లో గంజాయి లభ్యం

**నిందితుడి అరెస్ట్**



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

అనంతగిరి: రైల్వే స్టేషన్‌లో ఎక్సైజ్ పోలీసులు చేపట్టిన తనిఖీల్లో 16.3కిలోల గంజాయిని సీజ్ చేశారు. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో సోదాలు నిర్వహించగా మహారాష్ట్రకు చెందిన మహేశ్ వద్ద గంజాయి లభ్యమైంది. గంజాయిని స్వాధీనం చేసుకుని నిందుతుడిని అరెస్టు చేశారు. ఈ తనిఖీల్లో ఎస్‌ఐ కోటేశ్వర్‌గౌడ్ సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధి కోసమే పార్టీ మారా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

- నియోజకవర్గ అభివృద్ధికి రూ.1,679 కోట్లు తీసుకువచ్చా
- ఆరోపణలు చేసిన వారు ప్రమాణానికి సిద్ధమా..?
- తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు: నియోజకవర్గ అభివృద్ధి కోసమే తాను పార్టీ మారానని.. పార్టీ మారేందుకు తాను వందల కోట్లు తీసుకుని పీసీసీ చీఫ్ తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నానరి తాండూరు ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన పట్టణంలోని తన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తనపై ఆరోపణలు చేసే వారు తాండూరు టికెట్ ఎంతకు అమ్ముకున్నారో చెప్పాలని ధ్వజమెత్తారు. భూ కబ్జాలకు పాల్పడుతున్నాని ఆరోపించిన రేవంత్‌రెడ్డి భద్రేశ్వరాలయంలోకానీ, నిజాంషాహి దర్గాలో కానీ ప్రమాణం చేసేందుకు సిద్ధమని సవాల్ విసిరారు. తాను తాండూరు అభివృద్ధికి ప్రభుత్వం నుంచి రూ.1,679 కోట్ల నిధులు తీసుకువచ్చానన్నారు. కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న మనోహర్‌రెడ్డి నేతలకు రేటు కట్టి కండువాలు కప్పుతున్నారని ఆరోపించారు. ఆయనకు నియోజకవర్గంలో ఎన్ని గ్రామాలున్నాయో కూడా తెలియనది ఎద్దేవా చేశారు. అలాంటి వ్యక్తి తనను విమర్శించడం హాస్యాస్పదమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సందల్‌రాజుగౌడ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు అప్పు, నాయకులు కరణం పురుషోత్తంరావు, శ్రీశైల్‌రెడ్డి, శ్రీనివాసచారి, ఇందర్‌చెడ్ రాజు, సాయిరెడ్డి తదితరులున్నారు.

# ఆశావహులకు మొండి 'చేయి'

కాంగ్రెస్ విడుదల చేసిన రెండో లిస్టులో 'పట్నం' అభ్యర్థిగా మల్‌రెడ్డి రంగారెడ్డిని ప్రకటించింది. దీంతో ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించేవారు.. టికెట్ ఆశించిన నేతలు అసంతృప్తిగా ఉన్నారు. పార్టీ మారాలా..? రైబల్స్‌గా బరిలో ఉండాలా..? నిర్ణయం కోసం అనుచరులతో సమావేశమవుతున్నారు.

**కాంగ్రెస్ టికెట్ దక్కక నేతల అంతర్మథనం**

- అనుచరులతో సమాలోచనలు



ఇబ్రహీంపట్నం: కిం...కర్తవ్యం.. ఇప్పుడేం చేద్దాం అనే అలోచనల్లో పడ్డారు టికెట్ దక్కని కాంగ్రెస్ ఆశావహులు. శుక్రవారం విడుదల చేసిన రెండో లిస్టులో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి పేరును ఖరారు చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో మల్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్న వారు, పార్టీ టికెట్ ఆశించిన వారు.. అసంతృప్తులు ఇప్పుడేం చేయాలని సమాలోచనలు చేస్తున్నారు.

**ఆశించి భంగపడిన నేతలు**

మాజీ ఎంపీపీ మల్రి నిరంజన్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు దండెం రాంరెడ్డి, బీసీ వాదంతో ఈసీ శేఖర్‌గౌడ్ ఇబ్రహీంపట్నం టికెట్ కోసం తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు చేసి భంగపడ్డారు. ఆది నుంచి మల్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని దండెంరాంరెడ్డి, మల్రి నిరంజన్‌రెడ్డి వ్యతిరేకిస్తూ వస్తున్నారు. వీరు అధిష్టానం నిర్ణయాన్ని శిరసావహించి మద్దతిస్తారా..? లేక మరో దారి చూసుకుంటారా..? రెబల్స్‌గా బరిలో ఉంటారా అని పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి.

**గ్రూపు రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్**

'పట్నం' కాంగ్రెస్‌లో గ్రూపు రాజకీయాలు కొత్తేమీ కాదు. తొలినాళ్ల నుంచే వాటికి పెట్టింది పేరు. 1982లో ఏజీ కృష్ణ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉన్నప్పటికీ ఆయన వ్యతిరేకిస్తూ కొంతమంది గ్రూపు రాజకీయాలకు తెరలేపారు. తరాలు మారుతున్నా గ్రూపు రాజకీయాలకు కనుమరుగవ్వడం లేదు. పార్టీ వీటికి అడ్డుకట్ట వేయకపోవడంతో 1985 నుంచి ప్రతీ ఎన్నికల్లో ఈ స్థానాన్ని కోల్పోవాల్సి వస్తోంది.

**చివరి వరకు పోరాటం**

ఇళ్లు అలకగానే పండగ కాదు.. కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించిన మాత్రాన జరిగిదేమీ లేదు. ఆయనకు పార్టీ బీఫాం రాకుండా పోరాటం చేద్దామనే ధోరణిలో ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు శనివారం దండెం రాంరెడ్డి పెద్ద అంబర్‌పేట్‌లో తన ముఖ్య అనుచరులతో చర్చించినట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది.

**నిరంజన్‌రెడ్డి నిర్ణయంపై ఉత్కంఠ**

ఢిల్లీకి వెళ్లిన మాజీ ఎంపీపీ మల్రి నిరంజన్‌రెడ్డి శనివారం వచ్చినట్లు సమాచారం. ముందు నుంచి తనకే టికెట్ వస్తుందని ఆశతో ఉన్న ఆయనకు నిరాశే ఎదురైంది. ఆయన నిర్ణయంపై అనుచరులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. త్వరలోనే ఆయన అనుచరగనంతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలుస్తోంది.

**అంసతృప్తిని చల్లార్చేదెవరు..?**

కాంగ్రెస్‌లో రేకిత్తిన అసంతృప్తి జ్వాలలను చల్లార్చేవారెవరు..? అభ్యర్థి గెలుపునకు సహకరించేది ఎవరు అనే చర్చ నియోజకవర్గ వ్యాప్తంగా మొదలయింది. అధిష్టానం ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది చెప్పలేక పోతున్నారు. ఈ వివాదం సామరస్యంగా సద్దుమనుగుతుందా..? లేక కాంగ్రెస్ పుట్టి ముంచే ప్రమాదమేనైనా ఉందా అనేది వేయి చూడాల్సిందేనని పరశీలకులు అభిప్రాయపడుతున్నారు.

# స్థానికేతరులకు చోటు లేదు



ముచ్చర్లలో ఎన్నికల ప్రచారం ప్రారంభించిన మనోహర్‌రెడ్డి

**మహేశ్వరం నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి మనోహర్‌రెడ్డి**

కందుకూరు: మహేశ్వరం నియోజకవర్గంలో స్థానికేతరులకు స్థానం లేదని స్వతంత్ర అభ్యర్థి, కేఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ కొత్త మనోహర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని ముచ్చర్లలో ఆయన ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే హామీలన్నీ నెరవేరుస్తానన్నారు. ఫార్మాసిటీ భూ నిర్వాసితులకు న్యాయం చేసేంత వరకు పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతీ పేదకు 60 ఇంటి స్థలం ఇస్తానన్నారు. స్థానిక సమస్యలపై అవగాహన ఉన్నందున ప్రతీ ఒక్కరు తన గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భిక్షపతి, నాయకులు రాజేందర్, లక్ష్మయ్య, రాఘవేందర్, నాగార్జున, దశరథ, కుమార్, రవి, మహేందర్, శ్రీకాంత్, కృష్ణ, సత్తయ్య, రాజయ్య, రాములు, లక్ష్మయ్య, సంతోశ్‌ముదిరాజ్, పవన్, కార్తీక్‌రెడ్డి పాల్గొన్నారు.